క్లుప్తంగా

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత

మక్కువ: బొబ్బిలిలోని రాజా ఆర్ఎస్ఆర్కే రంగారావు కళాశాలలో ఈనెల 8వతేదీ నుంచి 10వతేదీ వరకు ఇస్రోసంస్థ వర్ల్డ్ స్పేస్ వీక్ నిర్వహించిన క్విజ్, డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు శనివారం అభినందించారు. మక్కువ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఎల్.సౌమ్య సాయి, ఎం.రేష్మశ్రీ, ఆర్.నారాయణరావు, కె.శిరీష, ఎస్.రాకేష్ క్విజ్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. అలాగే రుగడ హరిత డ్రాయింగ్ పోటీలో తృతీయస్థానం సాధించింది. మోడల్‌పాఠశాలకు చెందిన బి.యామిని, భవ్య, కీర్తన, జాబిలి, నిహారిక, దీక్ష, వర్షిని, మణిశ్రీ, సమీరా, హర్షిత క్విజ్‌పోటీలో గెలుపొందారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎన్.స్వర్ణలత, హెచ్ఎం జి.రోజారాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

చెస్ పోటీల్లో అరసాడ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

బలిజిపేట: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి చెస్ పోటీల్లో మండలంలోని అరసాడ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మండలస్థాయిలో ఎంపికైన విద్యార్థులకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించగా వారు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా వారిని ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. డివిజన్ స్థాయిలో అండర్-17బాలికల విభాగంలో సీహెచ్ దేవిక, పి.వినీత, ఎం.నిఖితలు, అండర్-17బాలుర విభాగంలో ఎం.కుమారస్వామి, ఆర్.కౌశిక్, బి.వెంకటరమణ జిల్లాస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం నాణ్యతపై అనుమానాలుంటే ఫిర్యాదు చేయండి


ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దాసు

సాలూరు: మద్యం వినియోగదారులు ఎవరికైనా మద్యం నాణ్యతకు సంబంధించి అనుమానాలుంటే స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌కు లేదా 14405 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదుచేయవచ్చని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దాసు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ, తమ పరిధిలో మద్యం షాపులు, బార్లలో సిబ్బందితో కలిసి ముమ్మర తనిఖీలు చేపడుతున్నామన్నారు.తనిఖీలు చేసి ,సుమారు 138 మద్యం నమూనాలను పరీక్షల నిమిత్తం ఇటీవల విశాఖపట్నంలోని ఎక్సైజ్ లేబొరేటరికి తరలించామని చెప్పారు. అక్కడి నుంచి వచ్చిన నివేదిక ప్రకారం మద్యం నాణ్యతతో ఉన్నట్లు పేర్కొన్నారు. ఇకనుంచి ప్రతి నెలా మద్యం దుకాణాలు, బార్లలో నమూనాలను సేకరించి పరీక్షించనున్నట్లు తెలిపారు.

మద్యం షాపుల తనిఖీ


బలిజిపేటలో మద్యంషాపులను తనిఖీ చేస్తున్న అధికారులు, సిబ్బంది

బలిజిపేట: నాణ్యమైన మద్యం అందించేందుకు మద్యం షాపులలో పూర్తిస్థాయి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సీతానగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ అధికారిణి పద్మావతి తెలిపారు. ఈ మేరకు బలిజిపేటలో మద్యం షాపులను శనివారం ఆమె తనిఖీ చేశారు. మద్యం నిల్వలను గుర్తించి, అక్కడికక్కడే నమూనాలను పరీక్షించినట్లు తెలిపారు. ఆ తరువాత వాటిని రసాయన విశ్లేషణ నిమిత్తం విశాఖపట్నంలోని ఎక్సైజ్ లేబొరేటరీకి పంపించనున్నట్లు చెప్పారు. మద్యం నాణ్యతకు సంబంధించిన ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నంబర్‌కు 14405కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ రేషన్‌కార్డులను సద్వినియోగం చేసుకోండి

జియ్యమ్మవలస: డిజిటల్ రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వై.జయలక్ష్మి అన్నారు. ఈ మేరకు ఆమె ఆధ్వర్యంలో అంకవరంలో శనివారం రేషన్ కార్డుల పంపిణీ చేపట్టారు.ఈ సందర్భంగా ఆమె క్యూ ఆర్ కోడ్‌తో ఉన్న డిజిటల్ రేషన్ కార్డులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్డు గుర్తింపు కార్డుగా కూడా ఉపయోగపడుతుందని చెప్పారు.

మక్కువ రోడ్డుకు అరకొరగా నిధులు

- రోడ్డు నిర్మాణంపై పెరుగుతున్న అనుమానాలు

సాలూరు:

సాలూరు పట్టణం నుంచి బాగువలస మీదుగా మక్కువ రహదారి నియోజకవర్గ ప్రజల ప్రధాన సమస్యల్లో ముఖ్యమైనది. పెద్ద పెద్ద గోతులతో నిండిన ఈ అధ్వాన రోడ్డు వల్ల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.ఈ మార్గం గుండా ఉన్న గోతుల్లో పడి అనేక ప్రమాదాలు జరిగాయి. వర్షాలకు గోతుల్లో నీరు చేరడంతో గోతుల లోతు అంచనా వేయలేక ద్విచక్రవాహన దారులు, పలు వాహనాలు ప్రమాదాలకు గురయ్యాయి. ప్రమాదాలకు ముఖద్వారంగా ఈ రోడ్డు మారిన దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వంలో ఇటీవల ఈ మార్గం గుండా బస్సు సర్వీసులను సైతం ఆర్టీసీ నిలిపివేసిందంటే ఈ రోడ్డు ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.


గోతులతో స్వాగతం పలుకుతున్న బాగువలస మీదుగా సాలూరు-మక్కువ రోడ్డు

అరకొరగా నిధుల మంజూరు

ఈ రోడ్డు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం తాజాగా రూ.5 కోట్లు మంజూరుచేసింది. కేవలం రూ.5 కోట్ల నిధులతో ఈ రోడ్డు నిర్మాణం పూర్తవుతుందా అన్నది నేడు ప్రశ్నార్థకంగా మారింది. గత ప్రభుత్వంలో కొంత పనులు జరిగిన నేపథ్యంలో నేడు కనీసం సింగిల్ రోడ్డు పూర్తిచేయడానికైనా కనీసం రూ.10 కోట్లు అవసరం ఉంటుంది. ఈ అరకొర నిధులతో రోడ్డు పనులు పూర్తిచేయడం ఎలా అంటూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అరకొర నిధులతో రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా వదిలేస్తారేమోనని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మంత్రి సంధ్యారాణి ఎన్నికల ముందు, అధికారంలోకి వచ్చిన తరువాత ఈ రోడ్డు పూర్తిచేస్తానని పలుమార్లు తెలిపిన నేపథ్యంలో అరకొర నిధులే విడుదలకావడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.ఇకనైనా ప్రభుత్వం స్పందించి పూర్తినిధులు మంజూరుచేసి ఈ రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

గత ప్రభుత్వంలో ప్రారంభమైన పనులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక కృషితో సాలూరు నుంచి మక్కువకు సుమారు 19.60 కి.మీ. రోడ్డు వెడల్పు, పటిష్ట పరిచేందుకు సుమారు రూ.55 కోట్ల 56 లక్షలు అంచనా విలువతో రోడ్డు మంజూరైంది. రూ.38 కోట్ల 52 లక్షల పనివిలువతో ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో ఈ పనులు ప్రారంభించారు. పనుల్లో భాగంగా 6 కి.మీ.మెటల్ లేయర్ వేశారు. 32 కల్వర్టులకు గాను 16 కల్వర్టులు, 8 మైనర్ బ్రిడ్జిలకు గాను 3 బ్రిడ్జిల నిర్మాణం పూర్తయింది. మిగిలిన పనులు చేపట్టాల్సి ఉండగా ఎన్నికల కోడ్ వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్డు పనులు ముందుకు సాగిన పరిస్థితి లేదు.

వైద్యం ప్రైవేటు పరం కాకూడదు


కోటి సంతకాల సేకరణ పత్రంపై సంతకాలు చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

- మాజీ ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: కూటమి ప్రభుత్వం పేదవాడి వైద్య విద్యను ప్రైవేటుకు ధారాదత్తం చేసే కుట్రకు తెరలేపిందని దానిని మనమే కాపాడుకోవాలని, పేదవాడికి వైద్యవిద్య అందుబాటులో ఉంచుకోవాలని నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని నారాయణపురం, మిర్తివలస గ్రామాల్లో కోటి సంతకాల సేకరణపై రచ్చబండ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవాడికి వైద్యవిద్య దూరం కాకూడదనే దూరదృష్టితో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టారన్నారు. వాటిలో 2023-24లో 7మెడికల్ కాలేజీలు పూర్తవగా, 2024-25లో ప్రారంభం కావాల్సినవి 4, 2025-26లో ప్రారంభం కావాల్సినవి 6మెడికల్ కాలేజీలు ఉన్నాయని అయితే వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నందున దానిని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రులు దోచుకునే అవకాశం

ప్రైవేటీకరణ వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య అందనంత దూరమవుతుందని, ఫీజులు భరించలేనంతగా పెరుగుతాయని, ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందుబాటులో లేకుండా పోతుందని, పేదలకు, మధ్యతరగతి ప్రజలకు ఉచిత సూపర్ స్పెషాల్టీ సేవలు దూరమవుతాయని, ప్రజారోగ్య వ్యవస్థ క్షీణిస్తుందని, లక్ష కోట్ల విలువచేసే ప్రజల ఆస్తులు ప్రైవేటు పరమవుతాయని, ప్రైవేట్ ఆస్పత్రులు ప్రజలను దోచుకునే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. ఇంతటి నష్టం కలిగే ఇటువంటి వాటిని పార్టీపరంగా అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌తో ప్రజలను మోసం చేసిందన్నారు. ఎవరికి ఏమి అందుతున్నాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేర కోటి సంతకాల సేకరణ చేపట్టి రాష్ట్ర గవర్నర్‌కు సమర్పించి కూటమి ప్రభుత్వం కుట్రలకు అడ్డకట్ట వేయాలని సంకల్పిస్తున్నామన్నారు. దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, మేధావుల సంఘం జిల్లా అధ్యక్షుడు పీఎస్ఆర్ నాయుడు, నారాయణపురం ఎంపీటీసీ రాజశేఖరం, మాజీ సర్పంచ్‌లు ప్రసాద్, డి.అప్పన్న, ఎం.శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ శ్రీరామూర్తినాయుడు, సన్నిబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి టి.ప్రసాద్, వాణిజ్యవిభాగం రాష్ట్ర కార్యదర్శి వాసుదేవరావు, పార్టీ జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

కాలువల సమస్య పరిష్కరించండి


అగురువీధిలో సమస్యలను పరిశీలిస్తున్న పట్టణ పౌరసంక్షేమ సంఘం నాయకులు

సాలూరు: పట్టణంలోని 6వ వార్డు పరిధి అగురు వీధిలో కాలువల సమస్యను పరిష్కరించాలని పట్టణ పౌరసంక్షేమ సంఘం నాయకుడు ఎస్‌వై నాయుడు కోరారు. ఈ మేరకు శనివారం అగురు వీధిని సంఘం సభ్యులు వెంకట్రావు, లలిత తదితరులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ వీధిలో కాలువలు లేక మెంటాడ వీధి నుంచి దిగువ గెడ్డకు ఉన్న మురుగు, వర్షపు నీరు వెళ్లడం లేదన్నారు.మెంటాడ వీధి కాలువల్లో పూడిక నిండిపోవడం, స్థానికంగా తుప్పలు అధికంగా ఉండడంతో నీరుదిగువకు వెళ్లకుండా కాలనీలో ఇళ్లనివాసాల వద్దకు వస్తోందన్నారు. దీనివల్ల దోమలు, ఈగలతో పాటు పాములు వంటి విషప్రాణులు వస్తున్నాయని ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఇక్కడి సమస్యలను పరిష్కరించాలనికోరారు. కార్యక్రమంలో పలువురు ప్రజలు పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాలలో మెగా జాబ్‌మేళా రేపు

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కన్వీనర్, ప్రిన్సిపాల్ శ్రీనివాసచారి ఓ ప్రకటనలో తెలిపారు. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, భగవతి ప్రొడక్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని తెలిపారు. పదవ తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియట్, డిప్లమో, డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు, నిరుద్యోగులను అర్హత ప్రకారం ఉద్యోగాలకు ఎంపికచేయనున్నట్లు పేర్కొన్నారు. జాబ్‌మేళాకు నిరుద్యోగులు సర్టిఫికెట్ల ఒరిజినల్, జిరాక్స్ కాపీలు, బయోడేటా, ఆధార్ కార్డు, ఫొటో తదితర పత్రాలతో హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు, నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గాలికి పడిన స్తంభాలు గాలికే వదిలేశారు

సాలూరు రూరల్:

ఇటీవల వీచిన ఈదురు గాలుల కు మండలంలోని పలు గ్రామాల్లో అరటి, మొక్కజొన్న, పామాయిల్ పంటలతో పాటు భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. అయితే చాలాచోట్ల విద్యుత్ స్తంభాలు పునరుద్ధరించలేదు. కొట్టుపరువు పంచాయతీ గ్రామాల్లో బూర్జి గ్రామంలో ఇంకా రోడ్డు పక్కన పంటపొలాల్లోను నేలకొరిగిన స్తంభాల స్థానంలో ఇంకా కొత్తవి వేయలేదు. విద్యుత్ తీగలు అలాగే పంటపొలాల్లో వేలాడుతున్నాయి. స్థానిక రైతులు పలుమార్లు విద్యుత్ శాఖాధికారులను సంప్రదించినా ఇంకా పనులు చేయడం లేదని వాపోతున్నారు.


బూర్జి గ్రామంలో నేలపై విరిగిపడి ఉన్న విద్యుత్ స్తంభం

స్తంభాలు లేవు

విద్యుత్ స్తంభాలు ప్రస్తుతం లేవు, మరో రెండు మూడు రోజుల్లో వస్తాయి. వచ్చిన వెంటనే విద్యుత్ లైన్లు యథావిధిగా పునరుద్ధరిస్తాం. గ్రామాలకు వేరే ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి విద్యుత్ అందిస్తున్నాం. పంటపొలాలకు కొన్ని చోట్ల ఇవ్వాల్సి ఉంది.


అరటి తోటలో వేలాడుతున్న విద్యుత్ తీగలు

లింగ వివక్షను పారదోలాలి

- ఎంపీపీ బి.ప్రమీల


ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ బి.ప్రమీల

పాచిపెంట: లింగ వివక్షను సమాజం నుంచి పారదోలాలని ఎంపీపీ బి.ప్రమీల అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని కేజీబీవీలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ బాలికల దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా ర్యాలీ నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలు మానసికంగా శారీరకంగా దృఢంగా ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మీసాల నారాయణమ్మ, ఎంపీటీసీ దండి ఏడుకొండలు, మండల విద్యాశాఖ అధికారి పి.సతీష్ మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ , కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం


వంతరాం కేజీబీవీ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

బలిజిపేట: అంతర్జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాన్ని వంతరాం కేజీబీవీ వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ బాలికలకు ఉన్న హక్కులు, చట్టాల పట్ల వారికి అవగాహన కల్పించడం ఎంతో అవసరమన్నారు. బాలికా విద్య ప్రాధాన్యం గురించి వారికి వివరించారు. పౌష్టికాహారం, పరిశుభ్రత, బాల్య వివాహాలు అరికట్టడం, విద్యాభివృద్ధి తదితర అంశాలపై విద్యార్థినులు ఎంతో అవగాహన కల్పించుకోవాలని ఆయా అంశాలపై సవివరంగా తెలియజేశారు. బాల్యవివాహాలు నిరోధించాలనే అంశంపై నాటికను ప్రదర్శించారు. విద్యార్థినులతో మానవహారం రూపొందించారు. కార్యక్రమంలో సీడీపీఓ కె.రాజ్యలక్ష్మి, ఎంఈఓ-1సామల సింహాచలం, సూపర్‌వైజర్ పద్మావతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీడీ ఎఫ్ఏసీ బాధ్యతలు తప్పించడం అన్యాయం

సీతంపేట: పార్వతీపురం మన్యం డీడీ ఎఫ్ఏసీగా విధులు నిర్వహిస్తున్న కృష్ణవేణిని ఆ బాధ్యతల నుంచి తప్పించడం అన్యాయమని ఆదివాసీ సేవా సొసైటీ నాయకుడు మూటక రవికుమార్ ఒక ప్రకటనలో ఖండించారు. నిరంతరం గిరిజన విద్యాసంస్థలు పర్యవేక్షిస్తూ, విద్యార్థుల బాగోగులను చూస్తు న్న గిరిజన మహిళ కృష్ణవేణిని బాధ్యతల నుంచి తప్పించి ఆమెకంటే జూనియర్‌ను ఇక్కడ నియమించడం తగదన్నారు. ఎటువంటి తప్పుచేయకపోయినప్పటికీ కేవలం గిరిజన మహిళ అనే చిన్న చూపుతో ఆ పోస్టు నుంచి తప్పించడం సరికాదన్నారు.

పంపిణీకి సిద్ధంగా కొత్త రేషన్ కార్డులు


వీఆర్వోలకు కార్డులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ ప్రసన్నకుమార్

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో వినియోగదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీకి సిద్ధం చేశామని తహసీల్దార్ ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు మండలానికి చేరిన కొత్త రేషన్ కార్డులను వీఆర్వోలకు సీఎస్‌డీటీతో కలిసి శనివారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఇంతవరకూ వినియోగదారుల వద్ద ఉన్న బియ్యం కార్డుల స్థానంలో కొత్తరేషన్ స్మార్ట్ కార్డులు వచ్చాయని తెలియజేశారు. పాత రేషన్ కార్డులున్న రేషన్ వినియోగదారుల కుటుంబాల వారికి ఆదివారం నుంచి ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్డుల పంపిణీ సమయంలో వీఆర్వోలు, రెవెన్యూ అధికార సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని, వారికి అవసరమైన సమాచారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ, ఉమామహేశ్వరరావు, ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పార్కు సుందరీకరణ వేగవంతం చేయాలి

- జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి


పార్కులో అభివృద్ధి పనులపై ఆరాతీస్తున్న జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి

గరుగుబిల్లి: పార్వతీపురం ఐటీడీఏ పార్క్ సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆయన మండలంలోని తోటపల్లి ప్రాజెక్టు కుడిమట్టి పరిధిలో ఉన్న పార్క్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్క్ ఆహ్లాదకరంగా, సుందరంగా కనిపించేలా అభివృద్ధిపనులను చేపట్టాలని సూచించారు. పార్క్ సమీపంలో ఉన్న తుప్పలను తొలగించి పర్యాటకులను ఆకర్షించేలా చేయాలని చెప్పారు. రానున్న కార్తీకమాసం నాటికి పార్క్‌లో అభివృద్ధిపనులను పూర్తిచేసి పర్యాటకులను మరింతగా ఆకర్షించేలా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. న్నారు. ఈ పరిశీలనలో ఐటీడీఏ ఈఈ తిరుపతిరావు, సిబ్బంది తదితరులున్నారు.

మక్కువలో బాలికా దినోత్సవం


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది


బాలికా దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మక్కువ: సమాజంలో లింగ వివక్షను పారదోలాలని ఎంపీడీవో అర్జునరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని కాశీపట్నం కేజీబీవీలో శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజశ్రీ, విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ చంద్రావు, ఎంపీటీసీ సభ్యురాలు జయమ్మ, ఎంపీడీవో అర్జునరావు, ఎంఈవో శ్యామ్‌సుందర్‌లు హాజరయ్యారు. బాలికా దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఆటలపోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అప్‌హోల్డ్ ఎన్‌జీవో రవికాంత్, పాఠశాల ప్రత్యేకాధికారిణి జి.నాగదుర్గ, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించరాదు


కేజీబీవీలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ-1సామల

బలిజిపేట: విద్యార్థినుల ఆరోగ్యం, పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహించరాదని ఎంఈఓ-1సామల సింహాచలం తెలిపారు. ఈ మేరకు మండలంలోని వంతరాం కేజీబీవీని ఆయన శనివారం పర్యవేక్షించారు. కేజీబీవీలో వసతి సౌకర్యాలు, ఆర్వోప్లాంటు, విద్యార్థినుల టాయిలెట్స్, బాత్‌రూములు, తాగునీటి సదుపాయాలను ఈ సందర్భంగా పరిశీలించారు. వంటగది ప్రాంతం ముందు భాగంలో అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి శుభ్రం చేయించాలని ఆదేశించారు. వంటగది, ఆహారపదార్థాలు, వంటసామగ్రి పరిశుభ్రంగా ఉండాలని స్పష్టం చేశారు. తరగతి గదులు, డార్మిటరీలు, రిజిస్టర్, రికార్డులు, పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు పెట్టి వారిని ముందుకు తీసుకురావాలని చెప్పారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఏవి అవసరమో ఆ నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గౌరీ సంతోషి, సహ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల భవనం నిర్మించండి


నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

- సీపీఎం ఆధ్వర్యంలో విద్యార్థుల నిరసన

పాచిపెంట: మండలంలోని మిలియా కంచూరు పంచాయతీ, అల్లంపాడు గ్రామంలో పాఠశాల భవన నిర్మాణం చేపట్టాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో విద్యార్థులు, గ్రామస్తులు శనివారం నిరసన తెలియజేశారు. పాఠశాల భవనం లేక విద్యార్థులు రేకుల షెడ్‌లో చదువుకుంటున్నారని, ఆ రేకుల షెడ్డు కూడా శిథిలావస్థలో ఉందన్నారు. మంత్రి గుమ్మడి సంధ్యారాణి, అధికారులు స్పందించి పాఠశాల భవనం మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని కోరారు.

కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరావు, స్థానిక సర్పంచ్ కోటపర్తి రామయ్య, కేరంగి సర్పంచ్ సోముల లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామికి పూజలు

వీరఘట్టం: స్థానిక వట్టి గెడ్డ పక్కన వెలసిన అయ్యప్పస్వామి సన్నిధానంలో శనివారం రాత్రి మాలాధారణ చేసిన అయ్యప్ప భక్తులు భక్తి శ్రద్ధలతో పూజ లు చేశారు. యజ్ఞకర్త ఎస్‌వీఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుడు, సుబ్ర హ్మణ్యస్వామి, దుర్గాదేవి, ఆంజనేయస్వామికి అష్టోత్తర శతనామావళి పూజలు చేశారు.